'మనిషి నమ్మకాన్ని, ఆలోచనలనీ శాసించగల శక్తి ఒక చిన్న తల వెంట్రుకకి వుంటుంది' అని ఎవరైనా చెబితే నమ్మేది కాదేమోకానీ ప్రస్తుతం మాత్రం ఆ మాటలని నూటికి నూరుపాళ్లు నిజమని నమ్మాల్సి వస్తోంది అంజలికి.

# నీడ

## ఆకునూరి మురళీకృష్ణ

అంతకుముందు రోజు తన కళ్లపడిన ఒక చిన్న వెంట్రుక ఇన్నాళ్ల తన నమ్మకాన్నీ, ఆలోచనా విధానాన్ని ఒక్కసారిగా మార్చేసింది. ఎప్పుడూ ఒంటరిగా గడపదాటి ఎరగని తనని ఒక డిటెక్టివ్ ఆఫీస్‌దాకా వెళ్లగలిగేలా చేసింది కూడా సన్నటి పొడవైన ఆ రాగి రంగు వెంట్రుకే.

అవును మరి... ఆమె దాన్ని చూసింది ఎక్కడో కాదు... కేంపు నుంచి తిరిగి వచ్చిన తన భర్త షర్టు జేబులో!

★★★

అంజలి ఆ ఆఫీస్‌లో కుర్చీలో కూర్చుని ఇబ్బందిగా కదిలింది.

డిటెక్టివ్ ఆఫీస్ అంటే ఇంగ్లీషు సినిమాల్లో చూపించినంత హడావుడిగా లేదు. ఒక చవకబారు ఫోటో స్టూడియోలా వుంది. అక్కడికి తను రావడమే ఒక వింతగా చూస్తున్నారు అందరూ.

డైరెక్టర్ కుర్చీలో కూర్చున్నతను మాత్రం ఏమాత్రం తొణక్కుండా అది తనకెంతో మామూలే అన్నట్టు ముఖం పెట్టి ''చెప్పండి'' అన్నాడు సాధ్యమైనంత దర్పంగా.

''నా పేరూ, వివరాలు రహస్యంగా వుంచుతారు కదూ?'' అంజలి అడిగింది అనుమానంగా.

''మీకా విషయంలో అనుమానం అక్కర్లేదు. నిర్భయంగా చెప్పండి'' అన్నాడు అతను హామీ ఇస్తున్నట్లుగా.

అంజలి నెమ్మదిగా పెదవి విప్పింది.

''నా భర్త నాకు తెలియకుండా ఎవరో అమ్మాయితో గడుపుతున్నారని అనుమానంగా వుంది'' అంటూ ఆగింది ఎలా చెప్పాలో తెలియక.

''మీ సమస్య నాకు అర్థమైంది. మీ దగ్గర మీ అనుమానాల్ని బలపరిచే సాక్ష్యాలేమైనా వున్నాయా?'' అడిగాడతను.

అంజలికి ఆ తల వెంట్రుక గురించి చెప్పాలని పించలేదు.

''ఆయన ప్రవర్తనే నా అనుమానానికి కారణం'' అంది.

''సరే! మీవారి పేరూ, అడ్రెసు ఇవ్వండి. మేం రహస్యంగా మీవార్ని గమనించి మీ అనుమాన నిజమో కాదో తేల్చి చెబుతాం'' అన్నాడు.

అంజలి తన భర్త రమణమూర్తి పేరూ, ఆఫీసు అడ్రెస్సు వివరాలూ ఇచ్చి అతని పాస్‌పోర్ట్ ఫోటో



### కథ వెనుక కథ

ఇద్దరు మనుషుల మధ్య అనుబంధం ఏర్పడడానికి ఆకర్షణ లేదా అవసరం కారణమైతే ఆ అనుబంధం బలపడడానికి నమ్మకం సహకరిస్తుంది. ఆ నమ్మకం లోపించడంవల్లనే మన చుట్టూ ఎన్నో స్నేహాలు, ప్రేమలూ చివరిదాకా నిలవలేకపోతున్నాయి.

ఒకే ఇంట్లో కలిసి జీవిస్తూ కూడా నిరంతరం ఒకరిమీద ఒకరు అనుమానంతో రగిలిపోయే భార్యాభర్తలనెంతమందినో చూస్తున్నాము. అలాంటి మనుషులే ఈ కథకి ప్రేరణ.

ఎదుటివారివైపు నుంచి ఆలోచిస్తే ఏ సమస్యా పెద్ద సమస్యలా కనబడదు. కానీ అలా ఆలోచించడానికి ఎదుటి వ్యక్తి మీద ఎంతో నమ్మకం అవసరం. సరిగ్గా ఈ ఆలోచనే నాచేత ఈ కథ రాయించింది.

'మంచి కథ ముగింపుతోనే ప్రారంభం అవుతుందని' నా నమ్మకం. అందుకే ఆలోచింపజేసే కథలు రాయడమన్నా, చదవడమన్నా ఎక్కువ ఇష్టం.

నా గురించి:

పేరు: రచయితగా ఇంకా రావాలి.

వయసు: పాఠకుడిగా పన్నెండు, రచయితగా రెండు వెరసి ఇరవైనాలుగు.

చదువు: వారం వారం ఆంధ్రభూమి విడవకుండా. కాలేజీలో అయితే డి.యం.ఇ

ఉద్యోగం: ఆంధ్రా బ్యాంకులో క్లర్క్.

'కథ వెనుక కథ' ద్వారా నా ప్రియ పాఠక మిత్రుల ముందుకు వచ్చే అవకాశం కల్పించిన ఎడిటర్‌గారికి కృతజ్ఞతలు.

- ఆకునూరి మురళీకృష్ణ
ఆంధ్రా బ్యాంకు
ముస్తాబాద్-505404.
కరీంనగర్ జిల్లా.



కూడా ఇచ్చింది. అతను అవన్నీ తీసుకుని ''ఓకే ఇంక మీరు వెళ్లవచ్చు. రెండురోజుల తరువాత కనబడండి'' అన్నాడు.

అంజలి కుర్చీలోంచి లేచి బయటకు నడిచింది.

భర్త జేబులో ఆ వెంట్రుక చూసిన రోజంతా ఆమె మూర్తి ప్రవర్తనని విశ్లేషించుకోవడంలోనే గడిపింది.

అతనికి తనపట్ల ఆకర్షణ తగ్గిందన్నది నూటికి నూరుపాళ్లు నిజం. ఆ విషయం అతని ప్రవర్తనలోనే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కానీ దానికి కారణం ఏమిటన్న విషయమే అంతుబట్టలేదు.

పెరిగిన ఉద్యోగ బాధ్యతలు, పని, ఒత్తిడి కొంత కారణం కావచ్చు అనుకుంది. వయసు మీద పడుతున్నకొద్దీ ముసలి వాళ్లమైపోతున్నామేమోనన్న దిగులుతో తన సామర్థ్యం మీద అతనికే నమ్మకం సన్నగిల్లి సైకలాజికల్‌గా తనంటే నిరాసక్తత ఏర్పరుచుకుంటున్నాడేమో అనుకుంది ఇన్నేళ్లు.

కానీ అతని జేబులో కనబడ్డ ఆ వెంట్రుక తన మనసులో కొత్త అనుమానాలని రేకెత్తించింది. ఆ వెంట్రుక ఒక స్త్రీదని నిస్సందేహంగా తెలుస్తోంది. అది ఆయన జేబులోకి ఎలా వచ్చింది?

భర్తకి తనమీద ఆకర్షణ తగ్గిపోవడానికి కారణం మరో స్త్రీనా?

తమ ఇద్దరి మధ్యా పెరుగుతున్న దూరానికి కారణం మరో మూడో వ్యక్తా?

ఆ ఆలోచన రాగానే గుండె ఝల్లుమంది అంజలికి. . కేంపులకనీ, ఆఫీసు పనులనీ పగలనకా, రాత్రనకా తిరుగుతూ వుంటాడు అతను. ఆ సమయంలో తనేం కూడా తిరగదుకదా? అతను ఎవరితో తిరిగినా తనకేం తెలుస్తుంది?

'ఎలా తెలుసుకోవడం?' అని బాగా ఆలోచించి మరీ పేపర్లో ఆ అడ్రస్ పుచ్చుకుని ఆ డిటెక్టివ్ కంపెనీకి వెళ్లింది.

అక్కడినుంచి బయటకు వచ్చేసాక అంజలికి చాలా బాధగా అనిపించింది. తన భార్యే తనమీద డిటెక్టివ్‌ని నియమించిందని తెలిస్తే మూర్తి ఎలా ఫీల్ అవుతాడు? తను అక్కడి వెళ్లి తప్పు చేసానా అనుకుందొక క్షణం. కానీ అంతలోనే తనకి తాను సర్ది చెప్పుకుంది.

అతను నిజంగానే చెడు తిరుగుళ్లు తిరుగుతూ వుంటే ఈ పరిశోధనవల్ల అతని నిజస్వరూపం బయటపడిపోతుంది. తను అతన్ని నిలదీసి అడుగగలుగుతుంది. ఒకవేళ తన అనుమానం నిజం కాదని తేలితే అంతకన్నా సంతోషించదగ్గ విషయం మరోటి వుండదు. తన మనసులోని అనుమానం నివృత్తి అయిపోతే అతనితో ఇంకా హాయిగా ఉండగలదు అనుకుని తనకు తాను సర్దు చెప్పుకుంది.

ఆ డిటెక్టివ్ చెప్పిన రెండురోజులూ రెండు యుగాలుగా గడిచాయి. ఆ రెండు రోజుల్లోనూ కూడా ఆమెకి భర్త ప్రవర్తన మరింత బాధ పెట్టింది. ఎందుకతను అంత అంటీ ముట్టనట్లు వుంటున్నాడో అంజలికి అర్థం కావడంలేదు.

పరస్త్రీ లోలత అంత బలంగా వుంటుందా?

అంజలికి భర్తని అంతగా లొంగదీసుకున్న ఆమె ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలం కూడా కొద్దిగా కలిగింది.

మూడోరోజు పొద్దునే భర్త ఆఫీస్‌కి వెళ్లగానే తను డిటెక్టివ్ ఆఫీసుకి బయలుదేరింది.

''రండి... మీ గురించే చూస్తున్నాను'' అన్నాడు డిటెక్టివ్ ఆఫీస్ డైరెక్టర్ అంజలిని చూస్తూనే.

అంజలి మాట్లాడకుండా వెళ్లి అతనికెదురుగా కుర్చీలో కూర్చుంది. అతనేం చెబుతాడా అని ఆమెకి చాలా ఆతృతగా వుంది.

అతడు అసిస్టెంట్‌కి ఏదో కేసు నెంబరూ, ఫైలు నెంబరూ అంటూ చెప్పి తీసుకురమ్మన్నాడు. అంజలికి విసుగనిపించింది. అక్కడ అంత హడావుడేం లేదని చూడగానే తెలిసిపోతుంది. అయినా ఎందుకో ఈ నాటకం? అనుకుంది.

అతను ఫైల్ అందుకుని చెప్పసాగాడు.

''మీరు చెప్పినట్లుగానే నిన్నంతా మీవార్ని మా మనుషులు ఫాలో అవుతూ ఆయన ఎక్కడెక్కడ తిరిగారో టైమ్‌తోసహా నోట్ చేసి వుంచారు. మీరు ఊహించింది నిజమే. ఆయన ఆఫీస్‌లో ఎక్కువ సమయంలేరు. చాలా సమయం బయటే వున్నారు'' అన్నాడు.

అంజలి ఊపిరి బిగపట్టింది.

''అయితే ఆయన ప్రవర్తన ఎక్కడా మాకు అనుమానాస్పదంగా కనబడలేదు. ఒక్క హాస్పిటల్‌లో రిసెప్షనిస్టు దగ్గర తప్ప''

''రిసెప్షనిస్టా? ఏ హాస్పిటల్?'' వెంటనే అడిగింది.

''వసుధ నర్సింగ్ హోమ్, పంజాగుట్ట'' చెప్పాడతను.

అదిరిపడ్డట్టు చూసిందామె.

''ఆయన... నిన్న ఏ టైమ్‌లో వెళ్లారక్కడికి?'' అడిగింది.

''సాయంత్రం ఐదూ, ఆరూ మధ్య. వెళ్లి అక్కడి రిసెప్షనిస్టుతో కాసేపు మాట్లాడి వస్తూ వస్తూ ఆమె ఎంత వద్దంటున్నా వినకుండా కొంత డబ్బు ఇచ్చి వచ్చారని మా వాళ్ల రిపోర్టు.''

అంజలి నమ్మలేనట్టు చూసింది.

''నిన్న ఆయన ఇంకెక్కడెక్కడ తిరిగారో వివరాలు చెప్తారా?'' అడిగింది గుండెల్ని చిక్కబట్టుకుంటూ.

అతడు ఫైల్లోంచి కాగితాలు తీసి ఆమెకిచ్చాడు.

ఆమె చదవసాగింది.

''ఉదయం పదకొండు గంటలకి ఆఫీస్ నుంచి బయలుదేరి ఇంటికి (?)... ఇంటి దగ్గర గేట్ వాచ్‌మన్‌తో కాసేపు మాట్లాడి ఇంట్లోకి రాకుండా అటునుంచి అటే బంజారాహిల్స్, అక్కడ రోడ్ నెంబర్ 12లో కారులోనే ఒంటరిగా రెండు గంటలు కూర్చుని... మళ్లీ ఆబిడ్స్. అక్కడ ఒక ఐస్‌క్రీ పార్లర్‌లో అరగంట... తరువాత పంజాగుట్ట సందులో కొంతసేపు గడిపి వసుధ నర్సింగ్‌హోమ్‌కి వెళ్లి అక్కడి రిసెప్షనిస్టుతో రెండు నిముషాలు మాట్లాడి ఆమెకి డబ్బిచ్చి అటునుంచి డైరెక్ట్‌గా బార్‌కెళ్లి రెండుగంటలు గడిపి అక్కడినుంచి ఇంటికి...''

చదువుతున్నకొద్దీ అంజలి ముఖం ఎర్రబడింది.


''నాకు ఇందులో మిస్టరీగా తోస్తున్నది ఒక్కటే విషయం. ఆయన ఆ రిసెప్షనిస్టుని కలవాలనుకున్నట్లయితే నేరుగా హాస్పిటల్‌కే వెళ్లవచ్చుకదా? మధ్యలో బంజారాహిల్స్‌లో రెండుగంటలూ, ఆబిడ్స్ చీరల షాపు ఎదురుగా ఐస్‌క్రీం పార్లర్‌లో అరగంట ఎందుకు గడిపినట్లు?'' తనలో తను అనుకుంటున్నట్లుగా అన్నాడు అతను.

అంజలి అతని మాటలు వినడంలేదు. ఆ రిపోర్టు ఇంకోసారి చదివింది. సందేహంలేదు. అవే ప్రదేశాలు! నిన్న తను తిరిగిన ప్రదేశాలే టైమ్‌తోసహా! బంజారాహిల్స్‌లోని ఫ్రెండ్ ఇంటికి వెళ్లి అక్కడ్నుంచి ఆబిడ్స్‌లో షాపింగ్ చేసుకుని సాయంత్రం వసుధ నర్సింగ్‌హోమ్‌కి వెళ్లింది లేడీ డాక్టర్‌ని కలిసేందుకు.

విషయం క్రమంగా అర్థవుతున్నకొద్దీ ఆమె ముఖం మరింత ఎర్రబడింది.

అంతకుముందురోజు అంతా తన భర్త తనకి తెలియకుండా తనని ఫాలో అవుతూ గడిపాడు!

ఎందుకు?



### వంట

''నేను ఊరికి వెళ్లినపుడు మా వారికి భోజనం ఎలాగా అనే దిగులు ఇక నాకు లేదు వదినా?''

''ఏం వంట మనిషిని పెట్టుకున్నారా?''

''అంత తెలివి తక్కువ పని నేను చేస్తానా వదినా? మా ఆయనకి దగ్గరుండి వంట చేయటం నేర్పించాను''


–పి. సరోజ (అమలాపురం)

సమాధానం ఆమెకి వెంటనే స్ఫురించింది. ఆ ఆలోచనతోనే ఆమెకి భూమిలో కూరుకుపోవాలనిపించింది.

''మీరు కనుక్కోమంటే ఆ రిసెప్షనిస్టు వివరాలూ, ఫ్యామిలీ బ్యాక్‌గ్రవుండ్, ఎలాంటి మనిషన్న విషయం కనుక్కుంటాం. ఆమెతోనేకాక ఇంకెవరితో మీవారు తిరుగుతున్నారో కూడా కావాలంటే...'' అతను చెబుతున్నాడు.

''అక్కర్లేదు'' అంటూ ఆపింది అంజలి అతన్ని.

''నాకు ఈ వివరాలు చాలు... చాలా శ్రమపడి ఈ వివరాలన్నీ నాకు అందించారు. థాంక్స్. మీ ఫీజు తీసుకోండి'' అని అతనికి డబ్బు చెల్లించి చిల్లరకోసం చూడకుండా వెనక్కి వచ్చేసింది.



### రెస్పాన్స్

బాలు బావమరిది 'శుభలేఖ' సుధాకర్ మంచి ఈజ్ వున్న నటుడు. అయితే ఆయన ఆశించినంత స్టార్‌డమ్ ఎచీవ్ చేయలేకపోవడానికి ప్రధాన కారణం ఆయన పర్సనాలిటీయే అని వేరే చెప్పక్కర్లేదు. అయితే ఈమధ్య విడుదలయిన 'ద్రోహి' చిత్రంలో శుభలేఖ సుధాకర్ పోషించిన ఉగ్రవాది పాత్రకు ముఖ్యంగా గౌతమిని రేప్ చేయబోతున్నప్పుడు అతని ముఖంలో కనబరిచిన ఫీలింగ్స్‌చూసి ఆడియన్స్‌లో మంచి రెస్పాన్స్ వచ్చింది. చాలా కాలం తర్వాత మంచి పాత్ర చేశాను అంటూ సంబరపడుతున్నాడు శుభలేఖ సుధాకర్.

–క్రిటిక్

భర్త ప్రవర్తనలో మార్పుకి కారణం ఇన్నాళ్లూ తను అనుకున్నట్లుగా రెండో ప్రేమా, మూడో మనిషి కాదన్నమాట కారణం! కేవలం తనమీద అనుమానం...

దీనికన్నా తన భర్త ఎవరితోనైనా తిరుగుతున్నాడన్న నిజం తెలిసినా ఇంకా నిబ్బరంగా వుండగలిగేదేమో అనిపించింది ఆమెకి.

ఎందుకు?

ఎందుకు వచ్చి వుంటుంది మూర్తికి తనమీద అనుమానం?

తన ప్రవర్తన అలా వుందా? అతడంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిందా? అతడివల్ల కోరికలు తీరడంలేదన్న భావాన్నెపుడైనా వ్యక్తపరిచిందా?

మరి... ఎందుకొచ్చి వుంటుంది అతనికి అంత అనుమానం?

ఏమిటి కారణం?

ఆలోచిస్తున్నకొద్దీ ఆమెకి నవ్వొచ్చింది.

తను అతనిమీద అనుమానంతో డిటెక్టివ్‌ని నియమించింది... దానికి కారణం ఏమిటి?

ఒక చిన్న తల వెంట్రుక... దాన్ని బేస్‌గా అల్లుకున్న తన ఆలోచనలు!

అలాంటి చిన్న కారణమే అతనికీ వుండొచ్చు.

ఆమెకి సడెన్‌గా గుర్తుకువచ్చింది గత కొద్దికాలంగా తన ప్రవర్తన. భర్త ప్రవర్తనకీ, జీవితంపట్ల అతను వ్యవహరిస్తున్న నిర్లిప్త ధోరణికీ తనకి భయమేసి అతని సమస్యని చర్చించేందుకు సరైన పరిష్కారం కనుగొనేందుకూ, తను గత కొద్దికాలంగా ఒక సైకియాట్రిస్ట్‌ని సంప్రదిస్తోంది.

ఆ రోజు తను వెళ్లింది ఆ డాక్టర్ దగ్గరకే.

ఈ వ్యాపకంలో తను బిజీగా వుంటూ అతనికి అనుకోకుండా దూరమైంది. గతంలోలా అతని ప్రతి చిన్న విషయాన్నీ పట్టించుకోలేకపోతోంది. అది తన తప్పు.

సడెన్‌గా మారిన తన ప్రవర్తన భర్తలో అనుమానాన్ని రేకెత్తించిందంటే అది అతని తప్పు కాదు.

అతను తర్వాత రోజు మళ్లీ ఆ హాస్పిటల్‌కి వెళ్లి డాక్టర్‌ని కలుసుకుంటే తనెందుకు ఆవిడ దగ్గరకెళ్లిందో తెలిసిపోతుంది.

ఒకవేళ అతను వెళ్లకపోయినా తనే అతనికి మొత్తం విషయం చెప్పేస్తుంది. మబ్బులు విడిపోతాయ్...

ఆమె ఆటో ఆపి ఇంటి అడ్రస్ చెప్పి ఎక్కి కూర్చుంది.

తన నమ్మకాన్నీ, ఆలోచనలనీ శాసించింది సన్నటి వెంట్రుక కాదు... అంతకన్నా సన్నని... కంటికి కనిపించని పొరలు... మనసుని కమ్మేసిన పొరలు.

ఒక్కో పొరా తొలగిపోతుంటే సీరియస్‌గా ఆలోచించసాగింది.

ఇంత స్వల్పకాలంలోనే తామిద్దరి మధ్యా వున్న ఆకర్షణ అంతలా ఎలా తగ్గిపోయిందా అన్నది కాదు ఇప్పుడు ఆమెని వేధిస్తున్న ప్రశ్న.

ఇన్నేళ్ల వైవాహిక జీవితంలో ఒకరిమీద ఒకరు ఒక చిన్న నమ్మకాన్ని ఎందుకు పెంచుకోలేకపోయామా అనే బాధే ఆమెని పట్టి కుదిపేస్తోంది. ■

